మహిళా దినోత్సవం

సాక్షి మంచిర్యాల


రేపటికి ముందడుగు

7


బుధవారం । 8 । మార్చి । 2023




ఆడపిల్లగానే పుట్టాలని ఉంది !




మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవిస్తున్నారా..?



మహిళగా మీరు ఎక్కువగా ఇబ్బంది పడిన అంశం..?



మీకు పూర్తి అధికారం ఉంటే... మహిళల కోసం ఏం చేస్తారు ?



మళ్లీ జన్మంటూ ఉంటే... ఎలా పుట్టాలనుకుంటారు?

- వివక్ష లేని సమాజం రావాలి
- జిల్లాలోని మహిళా ఉద్యోగులు, విద్యార్థినుల మనోగతం
- 'సాక్షి' సర్వేలో అభిప్రాయాల వెల్లడి

మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅర్బన్: "మరో జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలని ఉంది. ఉచితవిద్య, ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. స్వతంత్రంగానే జీవిస్తున్నాం. కాలేజీల్లో.. పని ప్రదేశాల్లో.. ప్రయాణాల్లో టీజింగ్ ఇబ్బంది పెడుతోంది.." అంటూ మహిళలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నాలుగు అంశాలపై జిల్లాలో సర్వే నిర్వహించింది. జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రి, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, ఆర్టీసీ డిపో, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థినులు వందమంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

మహిళకు భద్రత కల్పించాలి



మహిళా దినోత్సవం రోజు మాత్రమే మహిళ గొప్పతనంపై చర్చించడం కాకుండా ప్రతీరోజు వారికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాలి. మన జీవితంలో స్త్రీ ఒక అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా అన్నివిధాలా ముందుకు నడిపిస్తోంది. ఇటీవలి కాలంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. మహిళలకు భద్రత కల్పించాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆడ, మగ వివక్ష లేకుండా ప్రతీరంగంలో మహిళలను ప్రోత్సహించాలి. ఆధునిక సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న దేశంలో మహిళలపై చిన్నచూపు ఉంది. మహిళలకు తోడ్పాటు అందిస్తే అన్నిరంగాల్లో ముందుంటారనడానికి నిదర్శనం ద్రౌపది ముర్మూ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడమే.

– జీ మమత, మంచిర్యాల

సమానత్వం కల్పించాలి



సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమానత్వం కల్పించాలి. సమష్టి సహకారం ఉండాలి. స్త్రీ అంటే ఒక నమ్మకం ఏర్పడాలి. సాధించిన విజయాలను గుర్తించడమే కాకుండా వాళ్లను అభినందిస్తూ ఎదుగుదలకు తోడ్పడాలి. మహిళలు పనిచేసే ప్రదేశం, ఇతర ఏ ప్రదేశాల్లో వాళ్లను ఇబ్బంది పెట్టకుండా చర్యలు చేపట్టాలి. సమాన స్వేచ్ఛ కల్పించడం, మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విజయాలను గౌరవించాలి.

– జీ స్వప్న, మంచిర్యాల

కష్టాలను అధిగమించి...



– నీరటి రాజేశ్వరి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

మంచిర్యాల టౌన్: పట్టణానికి చెందిన నీరటి బుచ్చయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె రాజేశ్వరి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసింది. తండ్రి కోఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. 2003లో అదే కార్యాలయంలో టైపిస్టుగా చేరింది. తన చదువుతో జూనియర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ పదోన్నతి పొందారు. జగిత్యాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో రెండేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జరిగిన ప్రమాదంలో భర్త ప్రసాద్ మృతి చెందాడు. తన ఇద్దరు పిల్లలతో పాటు, అత్త, తల్లి బాధ్యతలు చూసుకుంటున్నారు. తనకు అండగా ఎవరూ లేకపోయినా విధులకు న్యాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

న్యూస్‌రీల్

అర్చకసేవా వైభవరత్న అవార్డు ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న కృష్ణచైతన్య ఆచార్య

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాలచెట్టు మూలమలుపు వద్ద గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు కృష్ణచైతన్య ఆచార్య అర్చకసేవా వైభవరత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో హరిహర కళాభవన్ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం నిర్వాహకులు బ్రహ్మర్షి శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి, మహేంద్రవాడి వెంకటేశ్వర్‌రావు, సినీ హీరో సుమన్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. తనను గుర్తించి అవార్డు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కృష్ణచైతన్యను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాలలో తపస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా వివరాలు ఇంతవరకు ఆన్‌లైన్‌లో ఉంచకపోవడం బాధాకరమన్నారు. జీపీఎఫ్ ఖాతాలో ఇప్పటివరకు ఉన్న నిల్వ, మిస్సింగ్స్ క్రెడిట్స్ తెలుసుకోలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి ఖాతాల్లోంచి రుణాలు తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. బదిలీలు వేసవి సెలవుల్లోనే పూర్తి చేయడానికి షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా బాధ్యులు సమ్మయ్య, భారతీఅశోక్, నాగేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

రాజకీయాల్లో ఆమె..

- ఉమ్మడి జిల్లాలో రాణిస్తున్న మహిళలు
- ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్లుగా రాణింపు
- స్థానిక సంస్థల్లో సగం పదవుల్లో వారే..
- ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లో ఇంకా వెనుకే..
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాజకీయాలంటే మగ వారికే అనుకునే రోజులు గతం. రాజకీయాలే కాదు.. అన్నింటా అతివలూ సగం అనేది ప్రస్తుతం. రాజకీయ పదవుల్లోనూ మహిళలకు స్థానాలున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో 50శాతం స్థానాలను వారికే రిజర్వ్ చేశారు. చట్ట సభల్లోనూ సముచిత స్థానం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికే కొందరు మహిళలు చట్టసభల్లో అడుగుపెట్టి తమ ప్రత్యేకతను చాటుతున్నారు. ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా పురుష లీడర్లతో సమానంగా రాజకీయాల్లో రాణిస్తున్నారు. అయితే ఇంకా ఉమ్మడి జిల్లాలో మహిళా నాయకులు, ప్రజాప్రతినిధుల సంఖ్య మరింత పెరగాల్సి ఉంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఏకైక మహిళా ఎమ్మెల్యే



రేఖానాయక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పది అసెంబ్లీ, రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్సీ పదవుల్లో మగవాళ్లున్నారు. ఒక్క ఖానాపూర్ నియోజకవర్గం నుంచి మాత్రమే అజ్మీరా రేఖానాయక్ మహిళా ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె ఇక్కడి నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి సమర్థవంతంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి చట్టసభలో ఈమె ఒక్కరే ఉన్నారు. ఆసిఫాబాద్ జెడ్పీటీసీగా మొదలైన ఆమె ప్రస్థానం, రాజకీయంగా గెలుపోటములను లెక్కచేయకుండా ప్రస్తుత స్థాయికి చేరుకున్నారు. భర్త శ్యామ్‌నాయక్ ప్రోత్సాహం, తన ప్రతిభతో రాజకీయాల్లో ధైర్యంగా ముందుకు వెళ్తున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్లుగా ముగ్గురు..



కోవ లక్ష్మి



నల్లాల భాగ్యలక్ష్మి



కొరిపెల్లి విజయలక్ష్మి

ఉమ్మడి జిల్లాలోని నాలుగు జెడ్పీ స్థానాల్లో మూడింటిలో మహిళలే చైర్‌పర్సన్లుగా ఉన్నారు. తండ్రి మాజీ మంత్రి, కొట్నాక భీమ్‌రావు వారసురాలిగా మాజీ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆసిఫాబాద్ సర్పంచ్‌గా మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానం ప్రస్తుతం జెడ్పీ చైర్‌పర్సన్ వరకు కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కీలక నాయకురాలిగా ఉన్నారు. తన పెద్ద కూతురు అరుణ సిర్పూర్ (యూ) జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ఇక నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొరిపెల్లి విజయలక్ష్మి కొనసాగుతున్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని భర్త ప్రోత్సాహంతో జిల్లాలో కీలక స్థానంలో కొనసాగుతున్నారు. మంచిర్యాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నల్లాల భాగ్యలక్ష్మి ఉన్నారు. తన భర్త, మాజీ ఎమ్మెల్యే ఓదెలు ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణిస్తున్నారు.

స్థానిక సంస్థల్లోనూ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులుగా అనేక మంది మహిళలు రాణిస్తున్నారు. స్థానిక సంస్థల్లో సగం స్థానాలు మహిళలకే రిజర్వ్ చేశారు. దీంతో మగ వారితో సమానంగా వారూ పదవుల్లో కొనసాగుతున్నారు. మున్సిపాలిటీల్లోనూ మహిళా చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు ఉన్నారు. నాలుగు జిల్లాల్లో 12 మున్సిపాలిటీలు, 66 జెడ్పీటీసీ, 567 ఎంపీటీసీ, 1,508 సర్పంచ్, 12,554 వార్డు స్థానాలున్నాయి. వీటిలో ప్రతీ స్థానిక సంస్థల్లోనూ 50శాతం సీట్లు మహిళలకే రిజర్వ్ చేయడంతో వారు సగం స్థానాల్లో పదవుల్లో ఉన్నారు.

ప్రతిపక్షంలోనూ మహిళా నాయకత్వం



గండ్రత్ సుజాత



కొక్కిరాల సురేఖ

ప్రతిపక్ష పార్టీలోనూ మహిళా నేతలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కొక్కిరాల సురేఖ కొనసాగుతున్నారు. ఆమె నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేస్తున్నారు. అలాగే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఆదిలాబాద్ జిల్లాలో కీలక నాయకురాలిగా గండ్రత్ సుజాత ఉన్నారు. నిర్మల్ నుంచి గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన స్వర్ణారెడ్డి ప్రజాసేవలో ఉన్నారు. వీరే కాకుండా ఆయా పార్టీలకు మహిళా విభాగాలు, ఇతర పదవుల్లో నాయకత్వం వహిస్తున్నారు. వీరిలో కొందరు వచ్చే అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో పోటీ బరిలో నిలిచేందుకు సంసిద్ధులవుతున్నారు.

అడ్డంకులు దాటి ఐపీఎస్‌నయ్యా..

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



మంచిర్యాల క్రైం: 'కనిపించే మూడు సింహాలు నీతికి.. న్యాయానికి.. ధర్మానికి ప్రతి రూపాలైతే.. కనిపించని నాలుగో సింహమేరా ఈ పోలీస్' అనే సినిమా డైలాగ్‌కు అచ్చంగా సరిపోతారు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి. కేరళ రాష్ట్రంలోని మున్నార్ జిల్లా నుంచి 2009లో తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా ఈమె నియమితులయ్యారు. శిక్షణ అనంతరం మొదటి పోస్టింగ్ తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల ఏఎస్పీగా పని చేశారు. తర్వాత మల్కాజిగిరి డీసీపీగా, మహబూబ్‌నగర్ ఎస్పీగా విధులు నిర్వర్తించి శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేసుకున్నారు. రంగారెడ్డి, గద్వాల, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పని చేసిన కాలంలో రాజకీయ సవాళ్లను ఎదుర్కొని సమర్థవంతంగా సేవలందించారు. మహబూబ్‌నగర్‌లో పని చేసినప్పుడు 17మందిని పొట్టన పెట్టుకున్న సీరియల్ కిల్లర్‌ను కటకటాల్లోకి పంపించారు. అదే జిల్లాలో 12మందిని హత్య చేసిన మరో సీరియల్ కిల్లర్‌ను పట్టుకోవడంలో ఎంతో శ్రమించారు. నేరస్తులకు శిక్ష పడేందుకు సరైన ఆధారాలు సేకరించేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులతో పాటు స్వయంగా ఆపరేషన్స్ నిర్వహించారు. నేరస్తులకు శిక్ష పడేలా చేశారు. ఇంతటి సమర్థత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారి వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తూనే ఇటు కుటుంబ బాధ్యతలూ మోస్తున్నారు. రామగుండం సీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రెమా రాజేశ్వరిని మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' పలకరించింది. ఆమె ఏమన్నారంటే..

సాక్షి: మీరు పోలీస్ ఆఫీసరే ఎందుకు కావాలనుకున్నారు? ఇందుకు మీరెలా శ్రమించారు?

సీపీ: సివిల్ సర్వీస్ రాసి ఐపీఎస్ ఆఫీసర్‌నయ్యా. ఇందుకు నేను పడింది కఠోర శ్రమే. పురుషులతో సమానంగా శిక్షణలో ఉన్నతాధికారుల మన్ననలు పొందాను. కేరళ రాష్ట్రంలోని మా మున్నార్ జిల్లాలో తొలి ఐపీఎస్ అధికారిగా నియమించబడ్డాను. ఎంతో కష్టపడి ఇష్టమైన ఐపీఎస్‌గా ఎంపికైన నేను మహిళందరికీ ఆదర్శంగా ఉండేలా విధులు నిర్వర్తిస్తున్నాను.

సాక్షి: ఒక మహిళా ఐపీఎస్‌గా మీరు మహిళలకు ఏం చెబుతారు?

సీపీ: వ్యక్తిగత భద్రత, స్వయం సురక్ష అనేది మన బాధ్యత. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మనకు దొరికిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విజయం సాధించాలి. సమాజంలో మనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలి. మహిళలు ఎప్పుడు అధైర్యపడకూడదు. పోలీస్‌శాఖలో చేరేందుకు ముందుకు రావాలి. యూనిఫాం సర్వీస్‌లో పని చేసేవారికి సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. మంచి గుర్తింపు ఉంటుంది.

సాక్షి: సమాజంలో మహిళా ఐపీఎస్‌గా మీరు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా? ఎదుర్కొంటే వాటిని ఎలా అధిగమించారు?

సీపీ: గతంలో ఏ రంగంలోనైనా మహిళల సంఖ్య తక్కువగా ఉండేది. అందుకే ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుత కాలంలో పురుషులతో పాటుగా స్త్రీలకూ సమాన అవకాశాలున్నాయి. అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. ఇబ్బందులెదురైతే ధైర్యంగా వాటిని అధిగమించాలి. మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. దేన్నైనా ఎదుర్కొనే ధైర్యం ఉండాలి. ఈ రెండు ఉంటే చాలు.. ఎంతటి ఇబ్బందులెదురైనా అధిగమించొచ్చు. నా ధైర్యమే నన్ను ఐపీఎస్‌ను చేసింది.

సాక్షి: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మీరిచ్చే సందేశం?

సీపీ: చదువు అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ప్రధానమైంది. చదువుకునే అవకాశం దొరికినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. ఒక లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడితే అనుకున్నది సాధించవచ్చు. అప్పుడే మనకాళ్ల మీద మనం నిలబడడమే కాకుండా సాటి వారికి సాయపడవచ్చు. మన కుటుంబాలను కూడా సరిగా చూసుకోవచ్చు. మనం ఎదిగిన క్రమాన్ని తోటి మహిళలకు వివరించి వారిలో చైతన్యం తేవాలి.

మంచిర్యాల అర్బన్: రంగులు చల్లుకుని కేరింతలు కొడుతున్న చిన్నారులు



మంచిర్యాలక్రైం: అధికారులతో కలిసి నృత్యం చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి



నస్పూర్: క్యాంపు కార్యాలయంలో వేడుకల్లో కలెక్టర్ సంతోష్





బెల్లంపల్లి: నాయకులతో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే నడిపెల్లికి రంగు పూస్తున్న నాయకులు



హోలీ.. రంగుల కేళి

రంగుల పండుగ హోలీని జిల్లా ప్రజలంతా మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని రోజంతా ఆనందంగా గడిపారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నస్పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో సందడి చేశారు. మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పోలీస్ అధికారులు, సిబ్బందితో పాల్గొన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య వేడుకల్లో సందడి చేసి అందరిలో జోష్ నింపారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇంతింతై..

- అన్నిరంగాల్లో రాణిస్తున్న మగువలు
- పురుషులతో సమానంగా విధులు

'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్ లిఖిస్తుంది' అని మహాకవి గురజాడ చెప్పిన మాటలను నేటి మహిళలు అక్షర సత్యం చేస్తున్నారు. మనిషి జీవితంతో విడదీయలేని మూడు అక్షరాల బంధం మహిళ. తల్లిగా, చెల్లిగా, భార్యగా భిన్నమైన పాత్రలు పోషిస్తూ అందివచ్చిన అవకాశాలను విజయానికి మెట్లుగా చేసుకుని ప్రగతిపథంలో పయనిస్తోంది. 'ఇంతి'ంతై.. వటుడింతై అన్నట్లు కూలీగా, కార్మికురాలిగా, రైతుగా, ఉద్యోగిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పురుషులకు తీసిపోమని నిరూపిస్తున్నారు. సమానత్వపు అస్తిత్వాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అదృష్టంగా భావిస్తున్నా



శ్రీరాంపూర్:సింగరేణిలో మానాన్న వారసురాలిగా ఉద్యోగం చేయడం అదృష్టంగా భావిస్తున్నా. మా నాన్న ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కారుణ్య నియామకం కింద నాకు ఉద్యోగం వచ్చింది. నేను ఉద్యోగం చేస్తూ అమ్మ, తమ్ముడిని పోషిస్తున్నా. గొప్ప సంస్థలో పనిచేస్తున్నానన్న తృప్తి ఉంది.

– కోదాటి ప్రియాంక, బదిలీ వర్కర్

36 ఏళ్లుగా పనిచేస్తున్నా



శ్రీరాంపూర్:నా భర్త రాజమల్లు ఎస్సార్పీ 1 గనిలో పనిచేస్తూ మృతి చెందాడు. అతని స్థానంలో నాకు ఉద్యోగం వచ్చింది. అప్పట్లో పనులు చాలా కఠినంగా ఉండేవి. అందుకే ఉద్యోగం చేయాలంటే నాకు చాలా భయమేసింది. 36 ఏళ్లుగా సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నా. **– గోమాస లక్ష్మి, జనరల్ మజ్దూర్**

ప్రోత్సాహమిస్తే ఏదైనా సాధిస్తాం



శ్రీరాంపూర్:మహిళలకు ప్రోత్సాహం ఇస్తే ఏదైనా సాధిస్తాం. బీటెక్ చదివిన నేను సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరా. పదోన్నతి పొంది సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నా. సింగరేణి సంస్థ మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం అందజేస్తోంది. **– సోంశెట్టి వేణి, జీఎం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్**

పురుషులతో సమానంగా...



మంచిర్యాలక్రైం: పోలీస్ ఉద్యోగం అంటే ఒకప్పుడు మగవాళ్లే చేసేవారు. ప్రభుత్వాలు మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంతో పోలీస్ ఉద్యోగాలకు ముందుకు వస్తున్నారు. మానాన్నకు పోలీస్ ఉద్యోగమంటే ఇష్టం. మా అన్నయ్య కిరణ్‌కుమార్ పోలీస్ కానిస్టేబుల్‌కు కావడంతో మానాన్న నన్నుకూడా ప్రోత్సహించాడు. పురుషులకంటే ఆడవాళ్లు తక్కువేం కాదని వెన్నుతట్టాడు. ఆయన ప్రోత్సాహంతో ఎస్సై ఉద్యోగం సాధించా.

– అక్కల రాజమణి, ఎస్సై, మహిళా పోలీస్‌స్టేషన్, మంచిర్యాల

భర్త మృతితో బాధ్యతలు



మంచిర్యాలఅగ్రికల్చర్: మాది వ్యవసాయ కుటుంబం. మాకు పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. నాకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. నాభర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి బాధ్యతలన్నీ నాపైనే పడ్డాయి. వ్యవసాయాన్ని నమ్ముకుని సాగుబాట పట్టాను. కష్టపడి ముగ్గురు పిల్లలను చదవించాను. భూమిని నమ్ముకునే జీవిస్తున్నా. **– సుశీల, నెన్నెల**

కష్టాన్ని మెట్టుగా చేసుకుని..



ఆసిఫాబాద్‌అర్బన్: చిన్నతనంలోనే తండ్రిని ఊహ తెలిసిన తర్వాత తమ్ముడిని కోల్పోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అమ్మ కూలి పనులకు వెళ్లి చదివించింది. దేవాపూర్‌లో పదోతరగతి వరకు చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించా. అందులో చదువు పూర్తి చేసి మిషన్ భగీరథ గ్రిడ్‌లో ఏఈ ఉద్యోగం సాధించా. అనుకున్న లక్ష్యం నెరవేరింది. నేను అనుభవించిన పేదరికం నాకు ఎన్నో అనుభవాలను నేర్పింది. ప్రతీ మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి. **– దురిశెట్టి సోని, మిషన్ భగీరథగ్రిడ్ ఏఈ**

ఉన్నత స్థితిలో ఉండాలని..



మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మండలంలోని గుడిపేటకు చెందిన ఆసారి రాజ్యలక్ష్మి కిరాణ దుకాణం నిర్వహిస్తుండగా భర్త రాజమల్లు పాల వ్యాపారం చేస్తున్నాడు. దినదినం వ్యాపారం అభివృద్ధి చేసుకున్నారు. నిరుపేద యువతుల వివాహానికి పుస్తెమట్టెలు, ఆర్థిక సాయం అందిస్తున్నారు. మనం ఉన్నతంగా ఎదిగితేనే గుర్తింపు ఉంటుందని, కష్టమైనా తీసుకున్న సంకల్పాన్ని ఇష్టంతో చేస్తే తప్పక లక్ష్యాన్ని చేరుకుంటామని పేర్కొంటోంది.

– ఆసారి రాజ్యలక్ష్మి, గుడిపేట

'శ్రీవారిసేవ'లో గీత



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ముత్యాల గీత హైదరాబాద్‌లోని జీడిమెట్లలో స్కౌట్ శిక్షణ పొందింది. తనతో పాటు మరికొంత మందికి సేవా భాగ్యం కల్పించాలనే ఉద్దేశంతో 'శ్రీవారి సేవ' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏటా వందలాది మందికి తిరుపతి వేంకటేశ్వరస్వామికి సేవచేసే అవకాశం కల్పిస్తోంది. ఆసిఫాబాద్ నుంచి బృందాన్ని రైళ్లో తిరుమలకు తీసుకెళ్తుండగా ఎనిమిది రోజుల పాటు క్యాంపులో పాల్గొంటారు. ఏటా నాలుగు పర్యాయాలు తన బృందంతో శ్రీవారి సేవలో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 వేలకు పైగా భక్తులను శ్రీవారి సేవకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

– ముత్యాల గీత, ఆసిఫాబాద్

కష్టాలు అధిగమించాలి



చెన్నూర్: కష్టాలు అందరికీ ఉంటాయి. వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాలి. అప్పుడే జీవితానికి ఓ అర్థం ఉంటుంది. కష్టాలను తలుచుకుంటూ బాధపడితే అక్కడే ఉంటాం. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నేను ఎంబీఏ పూర్తిచేశా. నాభర్త అనిల్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వచ్చే జీతంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఉద్యోగం కోసం శ్రమించి 2019లో ఎస్సైగా ఎంపికయ్యా. చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నా.

– శ్వేత, ఎస్సై, చెన్నూర్

ప్రోత్సహించాలి



మంచిర్యాలక్రైం: గ్రూప్–2 పరీక్షలు రాయడంతో ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం వచ్చింది. విధుల్లో చేరాక ఇతరులకు సేవచేసే అవకాశం లభించింది. ఒకప్పుడు పోలీస్ డిపార్ట్‌మెంట్ అటే భయపడేవారు. సమాజం సైతం ఆడవాళ్లతో ఇదికాదని చులకన చేసింది. కానీ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ప్రోత్సహిస్తే ఏదైనా సాధిస్తామని నిరూపిస్తున్నారు.

– నిర్మల పాటిల్, ఎక్సైజ్ ఎస్సై, బెల్లంపల్లి

అద్భుతాలు సృష్టిస్తారు..



మంచిర్యాలక్రైం: ఆడవాళ్లు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఒకప్పుడు అటవీ శాఖలో మహిళలకు అవకాశమే లేకపోయేది. ప్రస్తుతం జిల్లాలో 73మంది మహిళలు వివిధ హోదాల్లో పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా ఇంకా ఎక్కడో ఓచోట మహిళేకదా అన్న వివక్ష కొనసాగుతోంది. చిన్నతనం నుంచే ప్రోత్సహించి చేయూత అందించినట్లయితే అద్భుతాలు సృష్టించగలరు.

– మమత, డీఆర్వో, మంచిర్యాల











'దురాడి' సంబురం

- కాముడి దహనం వద్ద రాత్రంతా జాగరణ
- సంప్రదాయ పూజలు చేసిన ఆదివాసీలు



పల్లెల్లో బోజర(ధర్మం) అడుగుతున్న గిరిజనులు



గుడాలు సమర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): హోలీ వేడుకల్లో భాగంగా మొదటిరోజు పులారా కార్యక్రమం నిర్వహించిన ఆదివాసీలు మంగళవారం దురాడీ సంబురాలు జరుపుకున్నారు. సోమవారం రాత్రి కాముని దహనం చేసిన చోటే రాత్రంతా జాగరణ చేశారు. అంతా కలిసి ఆడి పాడారు. కామదహనం చేసిన బూడిదను ఎవరూ దొంగలించకుండా రాత్రంతా అక్కడే జాగరణ చేశారు. పురుషులు ఉదయాన్నే నిద్రలేచి ఇంట్లో వండిన గుడాలు, గొడ్డలి, గడ్డపారలతో పొలిమేర వద్దకు వెళ్లి పాదలు కొట్టారు. నైవేద్యపు నీళ్లు చల్లి పూజలు చేశారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని వారి నమ్మకం. అనంతరం మళ్లీ కాముడి దహనం వద్దకు వెళ్లి గుడాలు నేవేద్యంగా సమర్పించారు. అక్కడే వాటిని ఆరగించాక బూడిదను తీసుకెళ్లి తమ ఇళ్ల ఎదుట చల్లారు. ఇలా చల్లడం వలన దుష్టశక్తులు ఇంట్లోకి ప్రవేశించవని వారి నమ్మకం. దురాడిలో భాగంగా డోలు వాయిస్తూ 'జాజిరి.. జాజిరి.. జాజిరేయ్' అంటూ ఇంటింటా తిరుగుతూ బోజర (ధర్మం) అడిగారు. చిన్నాపెద్దా తేడాలేకుండా అంతా కలిసికట్టుగా ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి బోజర అడుక్కున్నారు. అనంతరం సమీపంలోని వాగుల్లో స్నానం చేసి ఇళ్లకు బయలుదేరారు.

ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్‌లో ఆరుగురికి చోటు



బయ్యి మొగిలి   బి. జగ్గయ్య   చల్లూరి అశోక్   రాయిల్ల నర్సయ్య   సాగర్‌గౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏఐటీయూసీ కేంద్ర కమిటీ కౌన్సిల్ సభ్యులుగా బెల్లంపల్లి ఏరియా గోలేటి బ్రాంచి నుంచి ఆరుగురికి చోటు లభించింది. ఇటీవల భూపాలపల్లిలో నిర్వహించిన సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ద్వితీయ మహాసభల్లో కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి తెలిపారు. కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన వారిలో బయ్య మొగిళి, బి.జగ్గయ్య, చల్లూరి అశోక్, గాందర్ల కవిత, రాయిల్ల నర్సయ్య, సాగర్‌గౌడ్ ఉన్నారు. ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కేంద్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కౌన్సిల్ సభ్యులు కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కౌసర్‌నగర్‌కు చెందిన జె.శ్రీనివాస్ (35) ద్విచక్ర వాహనంపై మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా పులిమడుగు హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్త సారసాల గ్రామానికి చెందిన చకినాల ఉపేందర్‌పై కత్తితో దాడి చేసిన అదే గ్రామానికి చెందిన చకినాల లచ్చన్నపై మంగళవారం హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. పొలం చుట్టూ కంచె (దడి) విషయంలో ఇరువురి మధ్య తగాదా జరుగుతోంది. ఇదే విషయాన్ని మనసులో పెట్టుకుని ఉపేందర్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. కాగా ఇదే సంఘటనలో చకినాల ఉపేందర్ తన తండ్రి లచ్చన్నను కత్తితో గాయపర్చాడని కుమారుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన తనిష్క్



విద్యార్థి తనిష్క్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి రేకల తనిష్క్ అంతర్జాతీయ సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. డిసెంబర్ 28 నుంచి 30 వరకు కేరళలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. మే 15 నుంచి 20 వరకు భూటాన్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్, పీడీ తిరుపతి విద్యార్థిని అభినందించారు.